## మినీ కథ

"ఒక ఆడపిల్ల
మనసుకు—
ఆమె కట్టుకున్న చీరకు
సంబంధం ఉందా?"



# పరువు

వరస లక్ష్మీదేవి

అయ్యో! నేను ఏడవాలి. ఎలాగ! నేను అసలు ఏడవగలనా! ఏడ్పు వస్తుందా! అమ్మో! ఏడుపు. రాకపోతే ఎలాగ! తప్పక ఏడవాలి. కుమిలి కుమిలి ఏడవాలి. ఎలా! నాకు ఏడుపు రాదే! తీరా అక్కడికెళ్ళాక ఏడుపు రాకపోతే నలుగురిలోనూ ఎంత అప్రదిష్ట. అందులోనూ వెళ్ళేది అత్తగారి తరపు బంధువుల ఇంటికి మరీ. ముఖ్యంగా పరామర్శకు.

ఒకవైపు చీర కట్టుకుంటూనే ఆలోచిస్తున్నాను. పరామర్శకు వెళ్ళడం నాకు అసలు ఇష్టం లేదు. మా ఆయన బలవంతంగా పంపిస్తున్నారు. "నాకు ఆఫీసులో లీవ్ దొరకదు. నువ్వయినా వెళ్ళకపోతే బావుండదు. ఈరోజు బయలుదేరివెళ్ళి పరామర్శచేసి రా!" అంటూ ఆర్డర్ జారీచేసి మరీ వెళ్ళారు ఆఫీసుకు. ఇంక తప్పదురా! భగవంతుడా! అనుకుంటూ బయలుదేరుతున్నాను.

వాళ్ళ ఇల్లు దగ్గరయ్యేకొద్దీ నా గుండెలు పీచు పీచుమంటున్నాయి. ఏడుపు రాకపోతే అంతమందిలోనూ నా పరువు పోతుంది. ఎలా ఏడవాలి. గ్లిజరిన్ అయినా తెచ్చుకోవలసింది. ఇలా ఆలోచిస్తూ తడబడే అడుగులతో గేటు తీసుకుని లోపలికి వెళుతుంటే నా చీర గేటుకు తగులుకుని పర్‌మని చిరిగింది. ఒక్క క్షణం నా గుండె ఆగినట్టయింది.

నాకు ఎంతో ఇష్టమయిన చీర. మా ఆయనతో పోట్లాడిమరీ కొనిపించుకున్న చీర. మా ఎదురింటావిడతో పోటీపడి కొనుక్కున్న చీర. నా కళ్ళముందే చిరిగిపోతే అప్పుడొచ్చాయి నీళ్లు.

లోపలి నుంచి ఎవరో వస్తే వాళ్లని పట్టుకుని బావురుమని ఏడ్చాను.

అయ్యో! ఊరుకోమ్మా! పోయిన వాళ్లందరూ అదృష్టవంతులు. నువ్వే ఇలా ఏడిస్తే వాళ్లని ఎవరు ఓదారుస్తారు చెప్పు, ఈ సమయంలోనే మనసుని రాయి చేసుకోవాలి. ఎవరో నన్ను ఓదారుస్తుంటే నా చిరిగిపోయిన చీరని చూసుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నాను.